ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు

5

ఆదివారం 23 నవంబరు 2025

అరటి.. రైతు ఆవేదన

- పతనమైన అరటి ధరలు
- టన్ను రూ.8వేలు దాటని వైనం

రైతులు ఉల్లిపంటకు ధర లేక పొలాల్లో నే వదిలేసి నష్టపోయిన సంఘటనలు ఇప్పటి వరకు చూశాం. అదే పరిస్థితి అరటి సాగు చేసిన రైతులు కూడా ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన అరటికి ధర లేక పోవడంతో కోత దశకు వచ్చినా వాటిని చెట్లకు అలాగే వదిలేశారు. గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్నారు. చెట్లపై పాకానికి వచ్చిన కాయలు కొనేవారు లేకపోవడంతో మాగి రాలిపోతున్నాయి. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొనుగోలుకు రాకపోవడంతో రాలిపోతున్న అరటి కాయలు



సింహాద్రిపురంలో గెలలతో ఉన్న అరటి తోట



తోటలో గెలపైనే మాగిపోతున్న అరటి కాయలు

సింహాద్రిపురం / దువ్వూరు/లింగాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అరటికి గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు పడిపోవడంతో పెట్టుబడులు సైతం రాక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పులివెందుల, మైదుకూరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అరటి ఎక్కువగా సాగులో ఉంది. ఒక్క పులివెందుల నియోజకవర్గంలోనే ఉద్యావన శాఖ అధికారుల లెక్కల ప్రకారం 20,658 ఎకరాల్లో అరటి సాగులో ఉంది. మైదుకూరు నియోజకవర్గంలో దాదాపు 25 వేల ఎకరాల్లో సాగు చేశారు. అధిక పెట్టుబడు లతో కూడిన అరటి పంటకు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తోటల్లోనే అరటి గెలలు

గత సంవత్సరం మొదటి కోత అరటి కాయలు టన్ను ధర రూ.22 వేల నుంచి రూ.29 వేల వరకు పలికాయి. రెండవ కోత అరటి రూ.15 వేల నుంచి రూ.18 వేలు పలికాయి. ప్రస్తుతం మొదటి కోత అరటి కాయలు టన్ను రూ.5 వేల నుంచి రూ.8వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రెండవ కోత అరటికాయలు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ధర పలుకుతోంది. ఇక మూడవ కోత రైతులు తోటల్లోనే అరటి గెలలు వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు అరటి గెలలో ఒక కాయ మాగినా ఆ గెల పనికిరాదని వ్యాపారులు తోటలోనే వదిలేసి వెళతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర వచ్చే వరకు అరటి నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని, అరటి దిగుబడులు విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అరటి కాయలను చీనీ కాయల లాగా నిల్వ ఉంచుకోవడానికి కుదరదని సింహాద్రిపురం మండల ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు.

ఏడు ఎకరాల్లో సాగు చేసి నష్టపోయాను



ఏడు ఎకరాల్లో అరటి సాగు చేశాను. పెట్టుబడులు అధికంగా పెట్టాను. తోటలో కాపు బాగా ఉంది. వ్యాపారులు టన్ను రూ.4 వేల ధరతో అడిగారు. తప్పని పరిస్థితుల్లో అమ్మకం చేశాను. నిరుడుతో పోల్చుకుంటే ఈ సారి పాతిక భాగం కూడా ధర లేదు. దీంతో బాగా నష్టపోయాను.

\- ఎం.సుధాకర్‌రెడ్డి, మూడిండ్లపల్లె గ్రామం, దువ్వూరు మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



అరటి రైతులకు కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదు. ఎకరాకు లక్షన్నర రూపాయలు పెట్టుబడి పెడితే సగం కూడా తిరిగి రాని పరిస్థితి. ప్రభుత్వం అరటి రైతులందరికి పెట్టుబడి రాయితీ మంజూరు చేసి ఆదుకోవాలి. దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

\- రామచంద్రారెడ్డి, అరటి రైతు, లింగాల

9 ఎకరాల సాగుకు రూ.18 లక్షలు



గతంలో అరటి ధరలు అధికంగా ఉండటంతో నా సొంత పొలం 6 ఎకరాలు, కౌలుకు 3 ఎకరాలు తీసుకుని సాగుచేశాను. ఇప్పటికి సుమారు రూ.18 లక్షలు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం అరటి ధరలు పతనం కావడంతో పెట్టుబడి డబ్బు కూడా వచ్చే సూచనలు లేవు.

\- బి.పరమేశ్వరరెడ్డి, అరటి రైతు, సింహాద్రిపురం

నేడు సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి, నియోజకవర్గ, మండల స్థాయిల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల నేతృత్వంలో భక్తులు, ఎన్జీవోల సమన్వయంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులకు ఈ వేడుకల నిర్వహణపై తగిన ఆదేశాలు జారీ చేసినట్లుగా తెలిపారు.

పారదర్శకంగా రీసర్వే పనులు

- రాష్ట్ర సర్వే శాఖ డీడీ గౌస్‌బాషా



ముదుపులవేముల సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీ

పీలేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రస్తుతం ఉన్న సమస్యలు తొలగి, భవిష్యత్తులో సౌలభ్యం కలిగేలా రీసర్వేను పూర్తి పారదర్శకంగా చేయాలని రాష్ట్ర సర్వే, భూరికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ గౌస్‌బాషా సర్వే సిబ్బందిని ఆదేశించారు. 2వ విడత రీసర్వే జరుగుతున్న పీలేరు మండలం ముదుపుల వేముల పంచాయతీ సచివాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పర్యటన చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ రికార్డులు, రైతులు, ప్రజల వద్దనున్న రికార్డులను సరిపోల్చుకోవడం, గ్రామసభలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యుల్ని చేసి రీసర్వే చేయాలన్నారు. అనంతరం ఆయన పీలేరు తహసీల్దారు కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి భరత్, డివిజనల్ డిప్యూటీ సర్వేయర్ వెంకటరమణ, పీలేరు తహసీల్దారు శివకుమార్, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్ బాబు పాల్గొన్నారు.

కోదండరాముడికి స్నపన తిరుమంజనం



సుగంధ ద్రవ్యాలను తీసుకొస్తున్న ఆలయ అధికారి నవీన్‌కుమార్

ఒంటిమిట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర భద్రాద్రి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్‌లు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందుగా ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ సుగంధ ద్రవ్యాలను, పట్టు వస్త్రాలను, పుష్పాలను ఆలయ అర్చకులకు అందజేశారు. అర్చకులు స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రమాణాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు జిల్లాలోని వైద్యశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శనివారం సాయంత్రం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఏఎన్‌సీ కేసుల రిజిస్ట్రేషన్, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్, మలేరియా, డెంగ్యూ కేసులు తదితర విషయాలపై సమీక్షించి వైద్యశాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి సమయంలో జాగ్రత్తలను తెలియజేస్తూ జిల్లాలోని పీహెచ్‌సీలో ప్రస్తుత మరణాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సరిపడా మందులను సకాలంలో అందించి ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలోని మెడికల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రక్తహీనత, ఏఎన్‌సీ కేసుల రిజిస్ట్రేషన్, వ్యాక్సినేషన్, తల్లి పిల్లల నమోదు ప్రక్రియ తదితర అన్ని పారా మీటర్లలో జిల్లా పురోగతి సాధించేందుకు జిల్లా, మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలోని ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ ఉద్యోగులతో సమన్వయం కలిసి పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో, అడిషనల్ డీఎంహెచ్‌వో, డీఎంవో, పీవో ఎస్సీడీ, డీపీఎం, ఎస్‌వో తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం మెరుగుపడాలి

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మైస్కూల్ మైఫ్రైడ్ కార్యక్రమం ద్వారా అధికారులు పిల్లలకు ఆదర్శంగా నిలవాలని, పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లాలోని పాఠశాలను దత్తత తీసుకున్న అధికారులు తదితరులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దత్తత తీసుకున్న అధికారులు పాఠశాలను సందర్శించి పిల్లలతో అరగంట పాటు గడిపి విద్యా ప్రమాణాలను పరిశీలించాలన్నారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలియజేసి నాణ్యమైన విద్యను బోధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంఈవోలు, మండల ప్రత్యేక అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా బాలరాజు ప్రమాణ స్వీకారం



రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న డాక్టర్ బాలరాజు

రాజంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజంపేటకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్.బాలరాజు ప్రమాణ స్వీకారం చేశారు. రాజంపేటలోని ఓ కల్యాణమండపంలో రాష్ట్ర, జాతీయ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకుల సమక్షంలో ఐఎంఏ నిబంధనల మేరకు ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బన్సాలీ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ఐఎంఏ తనవంతు కృషి చేయాలన్నారు. పల్లెల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించినప్పుడే ఐఎంఏ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అధ్యక్షుడు డాక్టర్ ఎస్.బాలరాజు మాట్లాడుతూ ఐఎంఏ ఆదర్శాలకు అనుగుణంగా పనిచేసి డాక్టర్ల ఐక్యతకు, ఐఎంఏ ప్రతిష్ఠకు, పేదలకు సేవ చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఐఎంఏ జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ వినయ్ అగర్వాల్, ఏపీ మెడికల్ అసోసియేషన్ నాయకుడు శ్రీహరి రావు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు జయచంద్ర నాయుడు, డీన్ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్‌చంద్రబోస్, ఫైనాన్స్ సెక్రటరీ కార్తీక్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సి.సుధాకర్, శ్రీశైలం ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేశ్‌నాయుడు, డాక్టర్ అనిల్, డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బంగారు వ్యాపారి కిడ్నాప్ కలకలం

- కిడ్నాపర్‌లు పోలీసులే !
- రాత్రంతా వ్యాపారి అక్రమ నిర్బంధం
- ఎమ్మెల్యే వరద జోక్యంతో ఇంటికి చేరిన వ్యాపారి 7

అర్జీల పరిష్కార బాధ్యత జీఆర్ఏలదే

- పొంతన లేని సమాధానాలిస్తే చర్యలు తప్పవు 7
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఆలయ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- దేవదాయశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్



మన్యం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

రాయచోటి(నేతాజీసర్కిల్)/గుర్రంకొండ/చిన్నమండెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆలయ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని దేవదాయ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ తెలియజేశారు. శనివారం జిల్లా ఎండోమెంట్ అధికారి విశ్వనాధ్‌తో కలిసి సంబేపల్లె మండలంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం, సంబేపల్లె పశుపతినాథ ఆలయం, దేవపట్లమ్మ ఆలయాలను సందర్శించి పనుల పురోగతిపై పరిశీలించారు. కాగా నారాయణ రెడ్డిపల్లె గ్రామం మంచాలమ్మ తల్లి ఆలయ స్థలం ఆక్రమణకు గురవుతున్న విషయంపై రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్ నాయుడు, రాష్ట్ర బీజేపీ యువ మోర్చా శివప్రసాద్ గ్రామస్థులతో కలిసి స్థల విషయంపై ఎండోమెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రెడ్డెమ్మతల్లి సన్నిధిలో ప్రిన్సిపల్ సెక్రటరీ

చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారిని దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహర్‌లాల్ శనివారం దర్శించుకున్నారు. ఆలయాధికారులు, చైర్మన్ ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను ప్రిన్సిపల్ సెక్రెటరీకి చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు విశ్వనాథ్, శ్రీనివాసులు, శివయ్య, సంతోష్ పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయంలో..

మండలంలోని దేవగుడిపల్లి గ్రామ పంచాయతీలో వెలసిన మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్, కలెక్టర్ నిశాంత్‌కుమార్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ విశ్వనాధ, ఈవో కొండారెడ్డి, తహసీల్దార్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ప్రియుడే నిందితుడు

- మదనపల్లె డీఎస్పీ మహేంద్ర



హత్యకేసులో నిందితున్ని అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెఅర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీటీఎం క్రాస్ మహిళ హత్య కేసులో ప్రియుడే నిందితుడని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. శనివారం మదనపల్లె తాలుకా పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లె మండలం, సీటీఎం క్రాస్ పంచాయతీ, సీటీఎం క్రాస్ పాకాల మందవీధికి చెందిన సావిత్రమ్మ అలియాస్ బుజ్జమ్మ (45) ఈ నెల 18న రాత్రి హత్యకు గురైన విషయం తెలిసిందే. స్థానికంగా కాపురం ఉంటూ తన అన్నదమ్ములతో బంధువులతో కలిసి హరికథలకు వెళుతూ మిగిలిన సమయంలో మేస్త్రీల వద్ద కూలీ పనులు చేసుకుంటూ జీవించేది. తన భర్త అర్జునరావు ఐదేళ్ల కిందట మృతిచెందాడు. ఇద్దరు పిల్లలకు వివాహం చేసింది. ఈ క్రమంలో సావిత్రమ్మ మదనపల్లె మండలం, సీటీఎం గ్రామం, చిన్నాయచెరువుపల్లెకు చెందిన మంజునాధ అనే మేస్త్రీ వద్ద కూలీపనులకు వెళ్లేది. కాగా ఆమెతో ఆ మేస్త్రీ చనువుగా ఉంటూ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో సావిత్రమ్మ కొంతకాలంగా మంజునాధ వద్దకు కూలీ పనులకు వెళ్లకుండా మరొకరి వద్దకు వెళుతుండడంతో ఆమెపై అనుమానంతో సావిత్రమ్మను చంపాలని పథకం పన్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 16న రాత్రి 9 గంటలకు ఆమెకు ఫోన్ చేసి సమీపంలోని బీడు భూమి వద్దకు రమ్మన్నాడు. ఒంటరిగా వచ్చిన ఆమెతో గొడవపడ్డాడు. ఆమె మెడలోని టవల్‌ను గొంతుకు చుట్టి తద్వారా ఊపిరి ఆడకుండా చేసి చనిపోయాక అక్కడి నుంచి పారిపోయాడు. ఈ నేపథ్యంలో మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐలు గాయత్రి, అన్సర్‌బాషా కేసు దర్యాప్తులో విషయాలు బయటపడ్డాయి. ఈ నెల 21న మధ్యాహ్నం 3.30 గంటలకు సమాచారం అందుకున్న పోలీసులు టిడ్కో ఇళ్ల సమీపంలో నిందితుని అదుపులోకి తీసుకుని తాలుకా పోలీసుస్టేషన్‌కు తరలించారు. దర్యాప్తులో హత్య చేసినట్లు నిజం ఒప్పుకోవడంతో నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి ఒక మోటర్ బైకు, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ, ఎస్ఐలను డీఎస్పీ అభినందించారు.

టీడీపీ పాలనలోనే మైనార్టీల సంక్షేమం

- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్



మిస్బా కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి ఫరూఖ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో నుంచి ఇప్పటి ఆంధ్రప్రదేశ్ వరకు టీడీపీ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు సంక్షేమం, అభివృద్ధి దక్కుతోందని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జేసీఎం ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో పలమనేరు విద్యార్థిని మిస్బా తల్లిదండ్రులు నసీమా, వజీర్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కు, ఇంటి స్థలాన్ని మంత్రి ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు హైదరాబాద్‌లో రెండు నెలలకు ఒకసారి మతకలహాలు జరిగేవని, కానీ ఎన్టీఆర్ పాలన వచ్చాక మతకలహాలు తగ్గిపోయాయని, ఆయన హయాంలోనే మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మదనపల్లెలో రూ.5కోట్లతో మసీదు కట్టిస్తామన్న వైసీపీ అధినేత జగన్ ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. పలమనేరువాసి మిస్బా వైసీపీ పాలనలో ఆత్మహత్య చేసుకుందని, విషయం తెలుసుకున్న చంద్రబాబు ఆమె కుటుంబాన్ని ఆదుకుంటామని అప్పట్లోనే హామీ ఇచ్చారన్నారు. ఇందులో భాగంగానే మిస్బా కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల చెక్కు మంజూరుతో పాటు 02.50 సెంట్ల ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మిస్బా కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షలకు, ముస్లిం నేతలు మరో రూ.5లక్షలు వెచ్చించి మొత్తం రూ.10లక్షల నగదు సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్‌బాషా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్‌సాహెబ్, ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ మౌలానా ఫారూఖ్ షిబ్లి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌తాజ్, పర్వీన్ బేగం, హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, ఆర్‌టీఐ మాజీ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్, టీడీపీ నేతలు ఎస్‌ఏ మస్తాన్, రఫీ, మహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజలో పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్, లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అరవీడు ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం దేవదాయ ధర్మ దాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ హరి జవహర్ లాల్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధి, భ క్తుల సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రా. దాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగానే రూ. 98 లక్షల వ్యయంతో ఆలయ పునర్ని ర్మాణానికి అనుమతించిందన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్, స్థా నిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి సోదరుడితో హాఫ్‌డే లీవ్‌చిత్ర బృందం భేటీ

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం ది హాఫ్ డే లీవ్ చిత్ర బృందం మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిత్రం మంచి విజయం సాధించాలని నిర్మాతలకు దర్శకుడు చిత్ర యూనిట్ బృందానికి అభినందనలు తెలియజేశారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక



భీమ్లానాయక్, ఆంజనేయులు

సుండుపల్లె, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): మండల ఎస్టీయూ కార్యవర్గాన్ని శనివారం రాయచోటిలో ఎన్నుకున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర మైనార్టీ కోకన్వీనర్ ఆరీఫుల్లా తెలి పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరం తరం పోరాటం చేస్తున్న ఎస్టీయూ మండల నూ తన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అధ్యక్షుడిగా భీమ్లానాయక్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడుగా వెంకట్రమణనాయక్, కృష్ణానాయక్, కోశాధికారిగా అంబాద్‌బాషాలను ఎన్నుకున్నట్లు తెలిపారు. .

నేడు నేత్ర చికిత్స శిబిరం

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్‌ఎంఎం హైస్కూలు ఆవరణలో ముక్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారికి వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగాఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలతో పాటు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. వైద్యులు కంటి సమస్యలపై సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప భక్తులు

నందలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యప్ప భక్తులు దాదాపు 50 మంది శనివారం గురుస్వామి మేడా వెంకట కుమార్ ఆధ్వర్యంలో శబరిమలకు తరలివెళ్లారు. నందలూరు రైల్వే కేంద్రంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఇరుముడి కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఎల్లయ్య, ఏనుగుల బాలాంజనేయులు, తుమ్మల శ్రీధర్‌గౌడ్, సాంబశివయ్య, బ్యాంకు సుబ్బారెడ్డి, కాకి చంద్ర, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఖాదీర్, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు బయలుదేరారు.

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

● చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజా అవసరాలను తీర్చేవిధంగా అధికారులు పని చేయాలని ఆయన హితవు పలికారు. నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యం నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు మేడికొండు రవికుమార్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జీవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో చమర్తి మాట్లాడుతూ వైసీపీ దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు రాష్ట్రంలో అరాచకం సృష్టించి ప్రజలను ఇబ్బందులు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోకి వచ్చాయన్నారు. ఆరు మండ లాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్‌లు తదిత రులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో భేటీ ..

శుక్రవారం ఉండవల్లిలోని నివాస గృహంలో సీఎం చంద్రబాబును కలిసి రాజంపేట సమస్యలను వివరించారు. అన్నమయ్య ప్రాజెక్టును వెంటనే పునః ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేట ప్రాంతానికి రిలయన్స్ బయోగ్యాస్ పరిశ్రమను కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాజంపేట సమస్యలను పార్టీ అభివృద్ధికి తీసుకుం టున్న చర్యలను చంద్రబాబుకు వివరించారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

● సీఐటీయూ ఆధ్వర్యంలో జీవో ప్రతుల దహనం

రాయచోటిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నేతలు నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలకు వలస పాలన వాసనలు ఉన్నాయని, వాటిని ఆధునికీకరించి అమలు చేసేందుకే నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదంతా అబద్ధమని, వలస పాలనకు మించి బానిసత్వాన్ని కార్మిక వర్గం మీద రుద్దడంతోపాటు, కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసేందుకు నాలుగు లేబర్ కోడ్లలో అనేకమైన కార్మిక వ్యతిరేక విధానాలను చొప్పించారన్నారు. కార్మికుల హక్కులు మీద, ఉద్యోగ భద్రత, జీత భత్యాల మీద వేటు, రాత్రి పూట డ్యూటీలు వేసేందుకు యాజమాన్యాలకు ఆయుధాలు ఇస్తున్నారన్నారు. జీతాలు పెంచకుండా పని గంటలు పెంచి శారీరక, మానసిక శ్రమ దోపిడీతో సామాజిక సాంఘిక భద్రత లేకుండా చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అనంతరం లేబర్ కోడ్స్ నోటిపై చేసిన పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మిక రంగ నాయకులు నగేశ్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా కోశాధికారి రాంబాబు, చెన్నయ్య, నాగరాజు, వెంకట్రమణ, మంగమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కోడ్స్ పత్రాలను దహనం చేస్తూ నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

రాజంపేట టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రదాన కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో కార్మిక సంఘ నాయకులు రాజంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నేతలు లక్ష్మీదేవి, సాయికుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ ప్రాంగణంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా నాయకులు, ఏపీ ఎండీసీ జేఏసీ పోరాట కన్వీనర్ ఆర్.వెంకటేశ్ కార్మికులతో కలసి ధర్నా చేశారు. ఏపీఎండీసీ పోరాట యూనియన్ నాయకులు పులగంటి రమణయ్య, హరికృష్ణ, బి.హరి, సందీప్‌రెడ్డి, ఈయూ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం. శ్రీనివాసులు, మావిళ్ల రాధ, జి.వెంకటేష్, పులగంటి శ్రీనివాసులు, ముత్యాల శ్రీనివాసులు, సురేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

●వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

రాయచోటిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ చట్ట సవరణను తక్షణం ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల భూములకు రక్షణ కవచంగా ఉండే అసైన్డ్ చట్టాన్ని ప్రభుత్వం పరిరక్షించాల్సింది పోయి, పేద ప్రజలకు భూములను దూరం చేసే విధంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో 28 లక్షల కుటుంబాలకు 33.50 లక్షల ఎకరాల భూములను పంచినట్లుగా లెక్కలు చెబుతున్నాయన్నారు. ఈ భూముల పరిరక్షణ కోసం 1977లో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ శంకరన్ అసైన్డ్ చట్టాన్ని తీసుకువచ్చి పేదల ఆరాధ్యుడయ్యాడన్నారు. 20 ఏళ్లుగా ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వాలు అనేక కుట్రలు, కుతంత్రాలు పన్నాయని, వైసీపీ ప్రభుత్వంలో సుమారు 20 వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అనంతరం 20 వేల ఎకరాల భూములు, ఇతర అసైన్డ్ భూములపై నిషేధాన్ని విధించి ప్రజానీకానికి మేలు చేస్తున్నట్లుగా భ్రమలు కల్పించిందన్నారు. అయితే ప్రజల నమ్మకాన్ని నిర్వీర్యం చేస్తూ కూటమి ప్రభుత్వం ఈ నెల 10న అసైన్డ్ చట్టాని సవరిస్తూ.. నిషేధాన్ని ఎత్తివేయడమే కాకుండా అన్యాక్రాంతమైన భూములను 66 ఏళ్లకు, 99 ఏళ్లకు లీజుకు ఇచ్చే విధంగా సవరించి పేదల భూములను కబ్జాదారులకు, పెత్తందారులకు కట్టబెట్టే విధంగా చర్యలు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ. శ్రీనివాసులు, పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నేత వెంకటయ్య, లంబాడా హక్కుల నేత శంకర్ నాయక్, దళిత సంఘం నాయకులు పామయ్య వ్యకాస నాయకులు రెడ్డి సుధాకర్, వీరభద్ర వెంకట్రమణ, రెడ్డి ప్రసాద్, గాలివీటి రామాం జులు, పండరయ్య, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నేరాలకు స్వస్తి పలకకపోతే.. కఠిన చర్యలు

● రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

రాయచోటి టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర ప్రవృత్తిని అరికట్టే చర్యల్లో భాగంగా అన్నమయ్య జిల్లా పోలీసులు రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నేర చరితులు చట్టాన్ని గౌరవించడంతోపాటు, సత్ప్రవర్తనతో జీవించాలని పోలీస్ అధికారులు సూచించారు. చట్టానికి విరుద్ధంగా నడుచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో మంచి పేరుతోపాటు, కుటుంబాల భవిష్యత్తు కోసం మార్పు అవసరమని వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మళ్లీ నేరాలకు పాల్పడితే చట్టం నుంచి తప్పించుకునే అవకాశమే లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతి భద్రతలను బలోపేతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

సిద్ధవటం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మాధవరం ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ గృహాల పరిసరాల్లో వర్షపునీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, రాత్రి వేళల్లో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, జలుబు, దగ్గు తదితర సమస్యలతో బాధపడేవారు సమీప ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర



జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శ్రమదానం చేస్తున్న ఏఆర్ పోలీసులు

రాయచోటి టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంతో పాటు, సబ్ డివిజన్ కార్యాలయాలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాలు, అన్ని పోలీసు స్టేషన్లలో పోలీసు అధికారులు, సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఆయా కార్యాలయాల ఆవరణలో చెత్తను, వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించి చెట్లకు నీరు పోశారు. గునపం, పారలు చేతబట్టి పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఎస్పీ ఆదేశాల మేరకు భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని, ప్రజల్లో శుభ్రతపై చైతన్యం పెంచే దిశగా కృషి చేస్తున్నామని పోలీసులు స్పష్టం చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినందుకు కేసు

సిద్ధవటం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురి పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బ రామచంద్ర తెలిపారు. సిద్ధవటం పోలీసుస్టేషన్ లో శనివారం సాయంత్రం మాట్లాడుతూ బాకరాపేట గ్రామ శివారులోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

రాయచోటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



నియోజకవర్గ సీపీఐ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మహేశ్

రాయచోటిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ. మహేశ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రాంతీయ అభివృద్ధి పేరుతో భారీగా నిధులు కేటాయించినా, పలు పనులు నిలిచిపోయాయన్నారు. రాయచోటి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సాగు, తాగునీరు, రహదారులు, వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నీటిశుద్ధి ప్లాంట్ లేకపోవడంతో ప్రజలు కలుషిత నీరు తాగాల్సి వస్తోందన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత, ఐసీయూ, స్కానింగ్ యంత్రాల కొరతను తీర్చాలన్నారు. . రాయచోటి నియోజకవర్గంలో టమోటా ఆధారిత పరిశ్రమ, మామిడి జ్యూస్ ఆధారిత పరిశ్రమ, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి జక్కుల వెంకటేశ్, కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, రంగారెడ్డి, మర్రి సుమిత్ర జగన్‌బాబు, ఆంజనేయులు, ఫజిల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్యూమరేషన్ ఫారాలపై అవగాహన కల్పించాలి



బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ నరసింహకుమార్

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటె న్సివ్ రివిజన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ సూచించారు. శనివారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ వంశీరెడ్డితో కలిసి బీఎల్‌వోలకు అవగాహన కల్పిం చారు. 2025 ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరించాలనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. ఓటరు నమోదు యాప్‌లో కొత్త ఓటరు నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, ఓటర్ల జాబితాలో తప్పులు, దిద్దుబాటు, పోలింగ్ స్టేషన్ కేటాయింపు తదితర అంశాలను బీఎల్‌వోలకు వివరించారు.

ఓటరు జాబితాను సవరించండి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి

రామాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను సవరించాలని రాయచోటి రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీవీఆర్ రికార్డులకు సంబంధించి తహసీల్దార్ వీఆర్‌వోల లాగిన్లను పరిశీలించారు. మండలంలో రెవెన్యూ సమస్యలపై ఆరా తీశారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ అందజేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులు, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ కృపావతి, ఆర్ఐ, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత గ్రామాల ఏర్పాటుపై శిక్షణ

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పచ్చ దనం, పరిశుభ్రత గ్రామాల ఏర్పాటు కోసం తీసుకోవాల్సిన అంశాలపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంబేపల్లె ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో ఎన్. సునీల్, వెలుగు ఇన్‌చార్జి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘం మహిళలకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పచ్చదనం, పరిశుభ్రమైన గ్రామం సాధనకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ సెక్రటరీలు, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీని తక్షణం అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

రైల్వేకోడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలోని అన్ని కేటగిరీలకు హెచ్‌ఆర్ పాలసీని తక్షణం అమలు చేయాలని ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గోపీకృష్ణ పవిత్ర తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండల విద్యాశాఖాధికారులు సురేష్ కుమార్, సుందర్‌బాబుకు ఈ నెల 24న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు ఉన్నాయని, ఇందుకు శెలవు కావాలని కోరుతూ వినతిపత్రం అంద జేశారు. నాయకులు హరిప్రసాద్, చంద్రశేఖర్, జయలక్ష్మి, చాముండేశ్వరి, విజయ కుమారి, రవిచంద్రశేఖర్, అరుణకుమారి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెకు అవార్డు.. కలెక్టర్ ప్రశంసలు

సుండుపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ పనుల అమలులో సుండుపల్లె మండలానికి రాష్ట్రంలో మూడవ స్థానం రావడంపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అభినందించినట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం శనివారం తెలిపారు. జన్ భాగీదార్ అవార్డు అందుకున్న ఆ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బందిని, రాజంపేట ప్రాజెక్టు ఆఫీసర్ అశోక్‌రెడ్డిని కలెక్టర్ సత్కరించి అభినందించినట్లు తెలిపారు. కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్‌చౌహాన్, తిమ్మసాని చంద్రశేఖర్‌లు సుండుపల్లె మండలానికి మంజూరు చేసిన రూ.20 లక్షల చెక్కును కలెక్టర్‌కు చూపించి ఫొటోలు దిగామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మినరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరపల్లి పాఠశాలలో కంప్యూటర్లు ప్రారంభం

రామాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సూరకవాండ్లపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నందలూరు కోటిరెడ్డి కంప్యూటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాలలకు తమవంతు సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో సూరకవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు రెండు కంప్యూటర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మూడు కంప్యూటర్లను అందజేశామన్నారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన కుమ్మరపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు రూ.30 వేలు, రూ.20 వేలు నగదు ప్రోత్సాహకం అందజేస్తామని ఆయన ప్రకటించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రదీప్‌కుమార్ రెడ్డి, క్రీడల్లో జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ నాయక్, ఉపాధ్యాయులు రమాకాంత్, మల్లికార్జున, కృష్ణయ్య, మస్తాన్, సుభాన్, నాగేంద్ర, భాస్కర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధితురాలికి పరామర్శ

రైల్వేకోడూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో గాయపడిన ఓబులవారిపల్లె మండలం పున్నాటివారిపల్లె అరుంధతివాడ కు చెందిన గొడుగులూరు గౌరమ్మను రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి ఎరామర్శించారు. ఆమె కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సీనియర్ నాయకుడు వాసుదేవరెడ్డి,ప్రధాన వైద్యురాలు బ్రహ్మకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరురూరల్ : కొత్తకోడూరు గంగమ్మ ఆలయం 4వ వార్షికోత్సవం సందర్భంగా ముక్కా సాయివికాస్‌రెడ్డి పూజలు నిర్వహించారు. రైల్వేకోడూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు పోకల మణి, కూటమి నాయకులు మల్లెం హేమంత్, అమర్, అర్చకులు జగత్పతి, ప్రదీప్‌శర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి నెబ్యులైజర్లు అందజేత

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెబ్యులైజర్ల కొరత ఉన్నట్లు తెలియడంతో రాయచోటి ప్ర భుత్వ ఏరియా ఆసుపత్రి ఉ పాధ్యక్షుడు, లయన్ వీ. హరీశ్ చంద్రఆర్థికసాయంతో మూడు నెబ్యులైజర్లను అందజేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. శనివారం అధ్యక్షుడు లయన్ పసుపులేటి శ్యామ్ సమ క్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజ నల్ ఛైర్మన్ షేక్. మహమ్మద్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

రైల్వేకోడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భోళాశంకర్ సేవా సమితి సహకారంతో శనివారం అంకమ్మనగర్‌కు చెందిన నాగరాజ, జ్యోతి కుమార్తె షానవిక పుట్టిన రోజు సందర్భంగా శ్రీనివాసనగర్, ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న మస్తానమ్మకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో సమితి అధ్యక్షుడు మందల నాగేంద్ర, సభ్యులు చెన్నం శెట్టి రమే శ్‌బాబు, వాసా బాబు, నాగరాజు, శంకరయ్య, సుబ్బరాయుడు, చింతకాయ ల నరసింహులు, శేఖర్, వీర య్య, బాబ్జీ పాల్గొన్నారు.

బంగారు వ్యాపారి కిడ్నాప్ కలకలం

- కిడ్నాపర్‌లు పోలీసులే !
- రాత్రంతా వ్యాపారి అక్రమ నిర్బంధం
- ఎమ్మెల్యే వరద జోక్యంతో ఇంటికి చేరిన వ్యాపారి

ప్రొద్దుటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో బంగారు వ్యాపారి కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. పట్టణ నడిబొడ్డు శివాలయం సర్కిల్లో శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో భార్యతో కలిసి స్కూటర్‌లో వెళుతున్న తనకంటి జ్యువెలర్స్ యజమాని తనకంటి శ్రీనివాస్‌ను కారులో వచ్చిన వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి బలవంతంగా తీసుకెళ్లారు. తన భర్తను ఎక్కడికి తీసుకెళుతున్నారని వారిని ప్రశ్నించగా త్రీటౌన్ పోలీసు స్టేషనుకు రమ్మని చెప్పారు. ఆమె హుటాహుటిన త్రీటౌన్ పోలీసు స్టేషనుకు వెళ్లి పోలీసులను అడుగగా తాము ఎవరిని తీసుకురాలేదని చెప్పారు. దీంతో ఆమె ఆందోళన చెంది రాత్రంతా ప్రొద్దుటూరులోని అన్ని పోలీసు స్టేషన్లకు వెళ్లి విచారించినా తన భర్త ఆచూకి తెలపకపోవడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపించారు. చివరకు అతడిని తీసుకెళ్లిందని పోలీసులే అని తేలింది.

శ్రీనివాస్‌పై చీటింగ్ కేసు నమోదు

హైదరాబాదుకు చెందిన హేమంత్ శర్మ అనే బంగారు వ్యాపారి 2015 నుంచి ప్రొద్దుటూరుకు చెందిన తనికంటి శ్రీనివాస్‌కు బంగారు ఆభరణాలు పంపించేవాడు. నగలు అమ్మి ఎప్పటికప్పుడు శ్రీనివాస్ డబ్బులు పంపించేవాడు. ఈ నమ్మకంతో 2018లో హేమంత్ శర్మ మరోవ్యాపారితో కలిసి సుమారు 10 కిలోల బంగారు నగలను నాలుగు నెలల కాలంలో శ్రీనివాస్‌కు పంపించారు. నగలకు సంబంధించి డబ్బులు ఇవ్వకుండా శ్రీనివాస్ కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో 2021లో నగల డబ్బులు ఇస్తామని హేమంత్ శర్మను ప్రొద్దుటూరుకు రప్పించి శ్రీనివాస్ అతని అనుచరులు కారులో తీసుకెళ్లి పట్టణ శివారులో చితకబాదారు. జరిగిన సంఘటనపై నాడు హేమంత్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీ గురువారం త్రీటౌన్ పోలీసు స్టేషన్లో తనికంటి శ్రీనివాస్ 10 కిలోల బంగారు తీసుకున్నాడని డబ్బులు అడిగితే దాడి చేశారని, చంపుతానని బెదిరిస్తున్నాడని హేమంత్ శర్మ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తాడిపత్రిలో ఉంటున్న తన తమ్ముడు వెంకటస్వామితో పాటు తనను పోలీసులు అదుపులోకి తీసుకుని కొర్రపాడు రోడ్డులోని ఒక ప్రైవేటు ఎస్టేట్‌లో నిర్బంధించారని శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయం శనివారం తెలియడంతో బంగారు వ్యాపారులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే జోక్యంతో శనివారం రాత్రి పోలీసులు శ్రీనివాస్‌ను వైఎంఆర్‌కాలనీలో ఉన్న అతని ఇంటికి తీసుకువచ్చారు.



బంగారు వ్యాపారి శ్రీనివాస్ ఇంట్లో పోలీసులు

ఆస్తిపత్రాలు తీసుకెళ్లిన పోలీసులు?

ఒన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ విజయవాడ నుంచి వచ్చిన వసంత్ అనే పోలీసు అధికారి శ్రీనివాస్ ఇంట్లో కూర్చొని వ్యాపారి హేమంత్ శర్మకు బాకీ డబ్బులు ఇవ్వాలని కోరారు. హేమంత్ శర్మకు తాను బాకీ లేనని తన తమ్ముడు బాకీ ఉన్నాడని శ్రీనివాస్ తెలిపాడు. తమ్ముడు తాను విడిపోయి చాలా ఏళ్లు అయిందన్నాడు. అయినా పోలీసులు రూ.కోట్ల విలువైన ఆస్తి పత్రాలతో పాటు తనికంటి జ్యువెలర్స్ దుకాణం తాళాలు తీసుకెళ్లారని శ్రీనివాస్ ఆరోపించారు. దీనిపై త్రీటౌన్ సీఐ వేణుగోపాల్‌ను ఆంధ్రజ్యోతి ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. కాగా.. సివిల్ పంచాయితీలో పోలీసులు కిడ్నాపర్లుగా మారిన తీరుపై తీవ్ర విమర్శలకు దారితీసింది. చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బంగారు వ్యాపారికి 41 నోటీసు ఇచ్చి విచారించే అవకాశం ఉన్నా అతడిని బలవంతంగా కారులో ఎత్తుకెళ్లి రాత్రంతా నిర్బంధించడంపై ఆరోపణలు వస్తున్నాయి.

25 నుంచి ఏసీఏ అండర్-14
ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 25వ తేదీ మంగళవారం నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. క్రికెట్ మ్యాచ్‌లు నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంతో పాటు కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలలో జరగనున్నట్లు వెల్లడించారు. మ్యాచ్‌ల వివరాలిలా.... ఈనెల 25 నుంచి 26వ తేదీ వైయస్ఆర్ఆర్ స్టేడి యంలో సౌత్‌జోన్ విన్నర్-నార్త్‌జోన్ విన్నర్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అలాగే కేవోఆర్ఎం స్టేడియంలో సెంట్రల్‌జోన్ విన్నర్-రెస్ట్ ఆఫ్‌సౌత్‌జోన్, కేఎస్ఆర్ఎంలో రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్-రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్‌ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని తెలిపారు. 28 నుంచి 29వ తేదీ వైయస్ఆర్ఆర్ స్టేడియంలో సెంట్రల్‌జోన్ విన్నర్స్-రెస్ట్‌ఆఫ్‌సెంట్రల్‌జోన్, కేవోఆర్ఎం స్టేడియంలో సౌత్ జోన్‌విన్నర్-రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్, కేఎస్ఆర్ఎంలో నార్త్‌జోన్ విన్నర్-రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్‌ల మధ్య పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీలు డిసెంబర్ 8వ తేదీ వరకు సాగుతాయని రెడ్డి ప్రసాద్ వెల్లడించారు.

క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 3న దివ్యాంగ క్రీడాకారుల జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సాధికార అధికారి జి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ (సాప్) ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లె వద్ద గల డీఎస్ఏ క్రికెట్ స్టేడియంలో పారా అథ్లెటిక్ క్రీడా పోటీలు ఉంటాయన్నారు. బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, వీల్‌ఛైర్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి క్రీడాకారులు అవగాహన ర్యాలీలో పాల్గొనేటట్లు స్థానిక క్రీడా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మరింత సమాచారం కోసం జిల్లా క్రీడా ప్రాధికార అధికారి 871262275ను సంప్రదించాలన్నారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు
అవకాశాలకు మార్గాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భావవ్యక్తీకరణ నైపుణ్యాలు కలవారే ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కడైనా సొంతం చేసుకోగలుగుతారని బెంగుళూరు ఎస్ఈఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్‌బీ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం వైవీయూ వాణిజ్యశాస్త్రశాఖలో కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సబ్జెక్టుకు సంబంధించి ఎంత విషయ పరిజ్ఞానం ఉన్నప్పటికీ అది వెల్లడించే నైపుణ్యత లేకపోతే అవకాశాలు దూరమవుతున్నాయన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసేటపుడు బయోడేటా ప్రభావవంతంగా ఎలా తయారు చేయాలి, ఇంటర్వ్యూ మెలకువలు, వ్యక్తిత్వ లక్షణాలు, సంభాషణా నైపుణ్యాలు, ప్రవర్తనా నైపుణ్యాల గురించి ఉదాహరణలతో వివరించారు. నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచనలు, బాధ్యతా విలువలు ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. కామర్స్‌శాఖ విభాగాధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి విద్యార్థుల సందేహ నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయభారతి, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

27 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 27వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంపీఎడ్, మూడో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను ఆయన ప్రకటించారు. ఈనెల 27, 29 డిసెంబరు 1,2,3,5,8 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు.


విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి



ఎత్తపు శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడుకు చెందిన యత్తపు శ్రీనివాసులరెడ్డి (49) అనే రైతు శనివారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. భార్య సుబ్బలక్షుమ్మ ఫిర్యాదు మేరకు వివరాలిలా.. శ్రీనివాసరెడ్డి తన ఇంట్లో ఉన్న ఇన్వర్టర్ పనిచేయకపోవడంతో మరమ్మత్తు కోసం విప్పేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. అతన్ని ప్రొద్దుటూరుకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు శ్రీనివాసరెడ్డికి కొడుకు నవీన్, స్రవంతి అనే కూతురు ఉన్నారు.

గుంజనేరులో మహిళ మృతదేహం



మృతురాలి మెడలోని తాయెత్తు

చిట్వేలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సమీపంలోని గుంజనేరులో శనివారం ఉదయం ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆమె నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చునని ప్రాథమికంగా అంచనా వేశారు. కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వివరించారు. మృతదేహంపై తెలుపురంగు నైటీ, రెండు చేతులకు నాలుగు ఇత్తడి గాజు లు, మెడలో తాయెత్తు ఉందని, వివరాలు తెలిస్తే చిట్వేలి ఎస్ఐ 9121100579, కోడూరు రూరల్ సీఐ 9121100576 నంబర్లను సంప్రదించాలని కోరారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి అమ్మాజాన్(23) ఆత్మహ త్యాయ త్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... పెద్దపాళ్యం వాసి అమ్మా జాన్‌కు ఆరీఫుల్లాతో వివాహమైంది. అయితే భార్య భర్తలిద్దరూ విడాకులు తీసుకున్నారు. దీంతో అమ్మాజాన్ అదే గ్రామానికి చెందిన సునీల్‌తో సహజీవనం చేస్తూ గర్భిణి అయ్యింది. దీంతో తనను వివాహం చేసుకోవాలని కోరగా సునీల్, అతని కుటుంబీకులు నిరాకరించడంతో విషద్రావణం తాగింది. దీంతో కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్
విధులను మెరుగుపరచాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులను మరింత మెరుగుపరిచి జాతీయ న్యాయసేవాధికార సంస్థ లక్ష్యసాధనకు పాటుపడాలని డీఎల్ఎస్ఏ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. శనివారం ఆమె తన చాంబర్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు.. వాటి పరిష్కారాలు తదితర అంశాలపై చర్చించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం న్యాయసేవాసదన్‌లో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి జిల్లాస్థాయి అధికారుల మానిటర్ మీటింగ్ వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. పరిహారం, చెల్లింపు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమాలలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, రెవెన్యూ డివిజనల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కార బాధ్యత జీఆర్‌ఏలదే..

- పొంతనలేని సమాధానాలిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ అధికారులు (జీఆర్ఏలు) బాధ్యతగా వ్యవహరించాలని, పొంతనలేని సమాధానాలతో కాలయాపన చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరకూరి హెచ్చరించారు. శనివారం కలెక్టరే ట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీ, జీఆర్ఏ ప్రతి స్పందనలపై జేసీ అది తిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీలు వెంకటపతి, రంగ స్వామిలతో కలసి సీఎంవో పీజీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి అధికారి సరళ, అన్ని డివిజన్ల రెవెన్యూ అధికారులతో ఫిర్యాదుల పరిష్కారం, ఆడిట్ అంశాలకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యల పరిష్కారంలో పారదర్శకత ఉండాలన్నారు. సమాధానాలు సూటిగా ఇవ్వాలన్నారు. ఫిర్యాదులు అందిన 24 గంటల్లోగా సంబంధిత జీఆర్ఏ అధికారులు ఖచ్చితంగా ఎండార్స్ మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుల ప్రాధాన్యత, ఫ్లాగ్ నోట్ చేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తహశీల్దార్లు పైస్థాయి అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారుల సమస్యలు అందిపుచ్చుకునేలా ఉండాలన్నారు. ఎక్కడా కూడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేయాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో జీఆర్ ఏలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఫిర్యాదుల పట్ల అలక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అన్ని శాఖల్లో పెండెన్సీ ఫిర్యా దులను వచ్చే నెలలోగా జీరోస్థాయికి తేవాలన్నారు. అలాగే గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్‌లో భాగంగా ఆయా మండలాల ఫిర్యాదులను నమోదు చేస్తున్న పీజీఆర్ఎస్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడి తరచూ ఎదురురయ్యే సమస్యలు, ఇబ్బందులను తెలుసుకొని సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో వీసీ ద్వారా సీపీవో ఓబులమ్మ, అన్ని డివిజన్ల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, డీఎస్పీ కరీం, అన్ని మండ లాల తహశీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



వీసీ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

కమలాపురం రూరల్/చెన్నూరు, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. శనివారం స్థానిక నాలుగో రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులు దళారుల చేతిలో మోసపోకూడదన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలోనే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ-పంటలో నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి అయిన రైతులు, తమ ధాన్యం విక్రయించేందుకు సిద్ధమైతే కొనుగోలు చేస్తామన్నారు. తాము అమ్మదలచిన ధాన్యం వాట్సప్ ద్వారా కూడా నమోదు చేసుకోవ చ్చన్నారు. అందుకు రైతులు 7337359375కు హాయ్ అని పంపాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా టోల్‌ఫ్రీ నెంబరు 1967ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రామనపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

చెన్నూరు మండలంలోని రామనపల్లెలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆర్డీవో జాన్ ఇర్విన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రామన పల్లెతో పాటు చెన్నూరులో కూడా కొనగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు ఏ మాత్రం ఆందోళన పడ కుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, వ్యవసాయాధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు మరింత ప్రోత్సాహం

పులివెందుల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించే రైతులకు మరింత ఆదాయం దక్కేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచా లకులు చంద్రానాయక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో వేరుశనగపంట సాగుచేసే రైతులను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రానాయక్ మాట్లాడుతూ ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ (ఎఫ్‌పీఓ) ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా గుర్తించి వారిని ప్రోత్సహించే దిశగా వేరుశనగ కాయలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. నూనె గింజల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఉచిత వేరుశనగ కాయలు పొందిన రైతులు తప్పనిసరిగా పంట సాగుచేయాలన్నారు. ఇ-క్రాప్‌లో నమోదు కావాలన్నారు. అవకతవకలకు పాల్పడితే రైతుల అకౌంట్‌ను రద్దు చేస్తామన్నారు. ముందుకు వచ్చే రైతులతో సంతకాలు కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంట సాగుచేస్తే మరిన్ని పథకాలను పులివెందుల రైతులకు తీసుకొచ్చే చర్యలు చేస్తా మన్నారు. అలాగే ఇష్టానుసారం ఎరువులు, పురుగుమందుల వాడ కం వల్ల భూమాత తన స్వభావాన్ని కోల్పోతోందన్నారు. అంతే కాకుండా వాతావరణం కలుషితమై క్యాన్సర్ వ్యాధి ప్రబలు తోందన్నారు. కావున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాల న్నారు. అనంతరం పులివెందుల మండలంలోని కనంపల్లె, చిన్నరంగాపురం, పెద్దరంగాపురం, లింగాల మండలంలోని ఇప్పట్ల తదితర గ్రామాలకు చెందిన వంద మంది రైతులకు ఉచితంగా వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏవోలు చెన్నారెడ్డి, రమేష్, సీఎస్ఏ ఎన్జీఓ ఆదినారాయణ, జనార్దన్, ఎఫ్‌పీఓ అంకిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

రాగి తీగలు, కేబుల్ చోరీ దొంగల అరెస్టు

పులివెందుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతు పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ తీగలు, మోటర్ల వద్దనున్న కేబుల్ దొంగతనం చేస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం డీఎస్పీ మురళినాయక్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. లింగాల, తొండూరు, సింహాద్రిపురం, తదితర మండలాల్లో ఇటీవల రైతులకు సంబంధించిన మోటర్ల వద్ద కేబుల్‌వైర్లు, పొలాల వద్ద ఉన్న ఆరు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌తీగలను దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై రూరల్ సీఐ రమణ, లింగాల ఎస్ఐ అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో బృందంగా ఏర్పడి ఈ కేసులను చేదించారన్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన జాఫర్ షరీఫ్, శివమొగ్గ జిల్లాకు చెందిన హరూన్ రషీద్, సత్యసాయి జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన హరిజన సురేంద్రలు ఈ దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. జాఫర్ షరీఫ్‌కు ఒక సొంత కారు ఉందని, డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారన్నారు. మద్యం, జూదం వంటి వ్యసనాలకు బానిసకావడంతో దొంగతనాలకు అలవాటుపడ్డారన్నారు. ఇతనికి హరూన్ రషీద్ స్నేహితుడు, హరిజన సురేంద్ర వీరికి తోడై కేబుల్, వైర్ల దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. పులివెందుల నియోజక వర్గంలోని రైతు పొలాల వద్ద ఉన్న ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి, అందులోని కాపర్ తీగలను చోరీ చేశారని తెలిపారు. వీరు పగలు కారులో తిరుగుతూ ఎక్కడెక్కడ మోటర్లు ఉన్నాయని గుర్తించి దొంగతనాలకు పాల్పడేవారు. వీరిని శనివారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో లింగాల మండలం అంబకపల్లె గ్రామ సమీపంలో ఎస్ఐ అనిల్‌కుమార్ అరెస్టు చేశారన్నారు. వీరి వద్ద నుంచి రూ.2ల క్షల 85వేలు విలువ చేసే కేబుల్, కాపర్ వైరు రికవరీ చేశామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళినాయక్

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఫిమెల్) శిక్షణ కోర్సులో (2025-26 విద్యాసంవత్సరానికి) ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కేంద్రాలలో శిక్షణ ఉంటుందన్నారు. సీఎఫ్‌డబ్ల్యు.ఏపీ.ఎన్‌ఐసీ.ఇన్ ద్వారా ప్రవేశ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేయాలన్నారు. కన్వీనరు, మేనేజ్మెంట్ కోటా సీట్లకు ఈ నెల 30 తేదీ చివరి గడువుగా పొడిగించినట్లు పేర్కొన్నారు.

గెస్ట్‌ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో గెస్ట్‌ఫ్యాకల్టీ నియామకం కోసం ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ.టి.శ్రీనివాస్ తెలిపారు. అభ్యర్థులు పీహెచ్‌డీ/ఎం.టెక్ (ఏదైన కంప్యూటర్ స్ట్రీమ్)/ఎంసీఏ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయో-డేటా, సంబంధిత ఒరిజినల్, జిరాక్స్ కాపీల సెట్‌తో నేరుగా న్యూ ఆర్ట్స్ బ్లాక్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మృత్యు మార్గం

● ప్రమాదాల నెలవు
నిమ్మనపల్లి- మదనపల్లి రోడ్డు
● కంకర తేలిన రోడ్లు



అధ్వాన్నంగా తయారైన నిమ్మనపల్లి - మదనపల్లి రోడ్డు

నిమ్మనపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మృత్యు మార్గంగా నిమ్మనపల్లి-మదనపల్లి రోడ్డు ఆవతరించింది ప్రజలు ప్రాణాలను బలిగొంటోంది. దాదాపు 22కిలోమీటర్లు వున్న మదనపల్లి రోడ్డు ఎక్కడ చూసినా కంకర తేలిన, గుంతలతో దర్శమిస్తున్నాయి. ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారు లకు చుక్కలు కనబడుతున్నాయి. వంద లాది వాహనాలు, రోజువారీ పనలుకు ప్రజలు ప్రయాణించాలన్నా ప్రమాదాలకు దారితీస్తున్నాయి. కొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం కోసుకుపోయి వాహనాలు వెళితే అదుపుతప్పి పడిపోయే పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూ ప్రజల ప్రాణాలను సైతం తీస్తున్నాయి. 15ఏళ్లుగా ఈ మార్గంలో రోడ్డుకు కనీసం చిన్నపాటి పని చేయలేదంటే అతిశయోక్తి కాదు. ఎగువమాచిరెడ్డిగారి పల్లి, పిట్టావాండ్లపల్లి రెడ్డివారిపల్లి, చల్లావాండ్లపల్లి, సమీపంలో అయితే రోడ్డు మొత్తం కోసుకుపోయి కంకర బైట పడింది. వైసీపీ ప్రభుత్వంలోనే డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు నేతలు ప్రకటించినా అది కాగితాలకే పరిమితమైంది. కనీసం రోడ్డు కోతకు గురైన మరమ్మతులు, ప్యాచ్‌లు కూడా వేయలేదని ప్రయాణీకులు తెలిపారు. అంతే కాకుండా నిమ్మనపల్లిలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు రోడ్డు సక్రమంగా లేక మదనపల్లి నుంచి తిరుపతి బైపాస్ ద్వారా వాల్మీకిపురం మార్గంలో నిమ్మనపల్లి వస్తూ విధులకు హాజరవుతున్నారు. ఈ రోడ్డులో నెల రోజుల కిందట తవళం విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇలా ఒకటేమిటి నిత్యం ఎదో ఒక చోట ప్రమాదాలు జరగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదు. అంతే కాకుండా ఎక్కడ పడితే అక్కడ రైతులు రోడ్డు తవ్వి పైపులు వేసుకోవడంతో ప్రయాణం మరింత నరకంగా మారింది. కాగా ప్రభుత్వం మదనపల్లెను జిల్లాగా ప్రకటించేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తున్న సమయంలో రోడ్లను మాత్రం అధికారులు గాలికి వదిలేశారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈ సూర్యానారాయణరెడ్డిని వివరణ కోరగా ఆయన స్పదించలేదు. డబుల్ రోడ్డు సరే కనీసం కంకర తేలిన రోడ్డుకు ప్యాచ్‌లు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆక్రమణలు అడ్డుకోవాలని వినతి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పీలేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ సమీప ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని బోడుమల్లువారిపల్లె ప్రజలు కోరారు. ఈ మేరకు తహసీల్దారు శివకుమార్‌కు శనివారం వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలోని సర్వే నెం.933లో ఉన్న ప్రభుత్వ భూమిలో గతంలోనే పేదలకు కాలనీ ఇళ్లు మంజూరు చేయగా కొందరు ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. అయితే ఇటీవల కొందరు ఆ భూమి తమకు ప్రభుత్వం పట్టా ఇచ్చిందని చెబుతూ అక్కడ నిర్మాణాలు చేసుకుంటున్న వారిని తరిమిమేస్తున్నారని తెలిపారు. ఆ భూమిపై ప్రభుత్వం ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన పత్రాలు చూపుతున్నా వారు పట్టించుకోవడం లేదన్నారు. పేదలకు ఉపయోగపడాల్సిన భూమిని కాపాడాలని వారు తహసీల్దారును అభ్యర్థించారు. రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వారికి తెలియజేశారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తులు

పీలేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తులు అధికారులకు సూచించారు. లోక్ అదాలత్ సన్నాహకాల్లో భాగంగా శనివారం పీలేరులోని 11వ అదనపు జిల్లా జడ్జి మహేశ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ సమీక్షించారు. క్రిమినల్, కాంపౌండింగ్, మ్యాట్రిమోనియల్, కుటుంబ తగాదాలు, మోటారు వాహన, ఎన్ఐ యాక్టు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎక్సైజ్, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. అటువంటి కేసులను గుర్తించి కక్షిదారులను చైతన్యపరచాలన్నారు. లోక్ అదాలత్‌కు వచ్చేటప్పుడు కక్షిదారులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకువచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ శారద, పోలీసు, ఎక్సైజ్ అధికారులు, కోర్టు లైజనింగ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణ



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రెండోరోజు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన థీమ్ 5లో భాగంగా రెండోరోజు పచ్చదనం పరిశుభ్రతపై కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు ఆయా గ్రామాల్లో వ్యక్తి గత పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన సదస్సులను నిర్వహించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. డంపింగ్ యార్డులకు చెత్తను తరలించి చెత్త నుంచి సంపదను సృష్టించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అన్నారు. గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుల్లోనే వేయాలన్నారు. మండల అధికారులు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, వెలుగు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'పని గంటలు పెంచడం దుర్మార్గం'



పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

పీలేరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నియంత పోకడలతో కార్మికుల పనిగంటలు పెంచడం దుర్మార్గమని పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనవాసి వెంకట్రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ నేటి వరకూ కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను తొలగిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తూ వారికి లబ్ధిచేకూర్చడం కోసం లేబర్ కోడ్స్ నోటిఫై చేసిందని దుయ్యబట్టారు. శారీరక, మానసిక శ్రమ పెంచి సమాజంలో అసమానతలు సృష్టించడానికి కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్రం తెస్తున్న లేబర్ కోడ్స్‌ను కూటమి ప్రభుత్వం అంగీకరించడం శోచనీయమని విమర్శించారు. ప్రజా మద్దతుతో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కార్మికుల సత్తాఏంటో బీజేపీకి రుచి చూపుతామని హెచ్చరించారు. పెంచిన పనిగంటలు తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు బి.వీ. రమణ, ఓబులయ్య, బీ. నాగార్జున, పెలి రెడ్డెప్ప, డీ. రమేష్, ఎస్. మస్తాన్, రాజేశ్వరి, సరోజిని, శాంతికుమారి, వెంటక్రమణ, ఎల్లయ్య, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని కలిసిన జనసేన నేతలు



నారా భువనేశ్వరితో సోమశేఖర్

పెద్దతిప్పసముద్రం నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గ నేతలు కోడికండ్ల చంద్రశేఖర్ శనివారం కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని కలిశారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను వివరించారు. పెద్దతిప్పసముద్రం మండలంలో నెలకొన్న పలు సమస్యలను ఆమెకు విన్నవించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే అత్యంత వెనకబడ్డ మండలం పెద్దతిప్పసముద్రమని, ఈ మండలంలో హెరిటేజ్ పరిశ్రమను నెలకొల్పితే అనేక మందికి ఉపాధి అవకాశాలు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26 నుంచి జాక్‌పాట్ రద్దు : చైర్మన్



విలేకర్లతో మాట్లాడుతున్న చైర్మన్ శివరామ్ తదితరులు

మదనపల్లెటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌లో ఈ నెల 26 నుంచి జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్, వైస్‌చైర్మన్ ఆంజనేయులు ప్రకటించారు. శనివారం మార్కెట్‌యార్డులో పాలకమండలి సభ్యులు మీడియా సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ చాలా ఏళ్లుగా మార్కెట్‌లో టమోటా వేలంలో జాక్‌పాట్ విధానంతో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయంపై మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టి పెట్టారని, ఇందులో భాగంగా నెల రోజుల నుంచి తాము మార్కెట్‌లో పర్యటించి పలువురు రైతులతో చర్చించి జాక్‌పాట్ విధానం రద్దుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అంతేకాకుండా 25 కిలోల క్రేట్లకు బదులు 15 కిలోల క్రేట్లతో టమోటా వేలం నిర్వహించాలని ఆలోచిస్తున్నామన్నారు. వైస్‌చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్‌లో దళారీలు ప్రవేశించడంతో నేడు మార్కెట్ మూతపడే స్థితికి వచ్చిందన్నారు. టమోటా మార్కెట్‌కు ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే కొన్ని విషయాల్లో ప్రక్షాళన చేయాల్సిన అవసరం వుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ చల్లా నరసింహులు, కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి అభిలాష్, డైరెక్టర్లు సుబ్రహ్మణ్యంరెడ్డి, బాబు, మున్నానాయక్, జిలానీబాషా, శంకర తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణకు సన్మానం

మదనపల్లె అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన రామకృష్ణ మొదటసారి మదనపల్లెకు విచేసిన సందర్భంగా జిల్లా నేతలు తోపు కృష్ణప్ప, శ్రీనివాసగౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కలిసి సన్మానించారు. జాతీయ కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు, విద్యార్థి, వ్యతిరేక విధానాలు, అధిక ధరలపై ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తున్న ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వాలకు మంచిదికాదన్నారు. కార్యక్రమంలో నేతలు తిరుమల, దేవా, ముస్తాన్, చలపతినాయుడు, చంద్ర, సూరి, సాయికిరణ్ పాల్గొన్నారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



హైస్కూల్‌లో క్లస్టర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ రామకృష్ణ

పెద్దమండ్యం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి సమష్టిగా కృషి చేయాలని పెద్దమండ్యం ఎంఈఓ గాజుల రామకృష్ణ సూచించారు. శనివారం హైస్కూల్ సబ్జెక్టు టీచర్స్ క్లస్టర్ సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక తరగతుల నిర్వహణకు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. డిసెంబరు 5వ తేదీన జరగనున్న మెగా పీటీఎం(పేరేంట్ టీచర్స్ మీటింగ్) సమావేశంలో విద్యార్థుల పరిజ్ఞానం తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కోసం హైస్కూళ్లకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిందన్నారు. గతేడాది పది ఉత్తీర్ణత శాతం, ప్రత్యేక తరగతుల నిర్వహణ, అంశాలపై అడిగి తెలుసుకుంటారని తెలిపారు. హైస్కూల్ ప్రత్యేకాధికారి ఉస్మాన్, సీఆర్పీ ఆర్మోహన్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిమళపై పోక్సో కేసు నమోదు చేయాలి

పీలేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు సెక్స్ పాఠాలు బోధిస్తూ వేధిస్తున్న అంబేడ్కర్ గురుకులం ఉపాధ్యాయిని పరిమళపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని సీపీఐ నేత టీఎల్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పీలేరు ఎస్ఐ లోకేశ్‌కు ఫిర్యాదు చేసిన ఆయన మాట్లాడుతూ పరిమళ గతంలో పనిచేసిన లక్కిరెడ్డిపల్లె గురుకులంలోనూ లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెండ్ అయినట్లు తెలిసిందన్నారు. విద్యార్థినులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయురాలు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం క్షమించరానిదన్నారు. ఆమెపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలి



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీన్ అడ్మినిస్ట్రేషన్ శ్రీమంతుబసు తదితరులు

కురబలకోట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మేనేజ్‌మెంట్ రంగాల్లో నైపుణ్యాలను మెరుగు పరచుకుంటే ఉజ్వల భవిష్యత్తును సాధించవచ్చని డీన్ అడ్మినిస్ట్రేషన్ శ్రీమంతుబసు విద్యార్థులకు పిలుపునిచ్చారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'వాల్యూ చైన్ ఆక్టివిటీస్ ఎగ్జిబిషన్' అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక వస్తువును మార్కెట్‌లోకి తీసుకురావడానికి నాణ్యత, ధర, వినియోగదారుడికి చేరే వేగం తదితర అంశాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వ్యూహ, ప్రతి వ్యూహాలు, నూతన వ్యాపార పెట్టుబడులు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంతో మార్కెటింగ్, అమ్మకాలు, కొనుగోళ్ల తదితర వాటికి సంబంధించి పూర్తిస్థాయిలో పట్టు సాధించాలన్నారు. విద్యార్థులు ప్రధానంగా వ్యాపారవేత్తలుగా ఎదగడానికి సాధ్యమవుతుందన్నారు. సాంకేతిక పద్ధతులపై పట్టు సాధించాలని దీంతో వ్యాపార రంగాల్లో రాణించవచ్చన్నారు. మేనేజ్‌మెంట్ రంగాల్లో నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో గీతాదేవి, అరుణ్‌కుమార్, ప్రసూన, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల ప్రయోజనానికే బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత సాంబశివ

మదనపల్లె అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ల అభివృద్ధి కోసమే నాలుగు లేబర్‌కోడ్లను అమలు చేస్తోందన్నారు. కార్మిక కోడ్లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో శ్రామిక వర్గం యుద్ధం ప్రకటిస్తుందని హెచ్చరించారు. ఏఐటీయూసీ నియోజకవర్గం కార్యదర్శి ముబారక్, పట్టణ కార్యదర్శి తిరుమల, జిల్లా సమితి సభ్యులు దేవా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత మస్తాన్, చలపతి నాయుడు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయండి

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక జడ్పీహైస్కూల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. డిసెంబరు 12, 13, 14 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న సభలకు విద్యార్థులు, యూటీఎఫ్ నేతలు హాజరవాలని కోరారు. వార్డెన్లు వెంకటేశ్, గంగిరెడ్డి, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నేతలు నాగరాజు, రామచంద్ర, చలపతి, అఫ్రిది, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం



తినుబండారాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త మాధురి

వాల్మీకిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల ఆహారం ద్వారా ఎన్నో ప్రయోజనాలతో పాటు ఆరోగ్యం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మాధురి పేర్కొన్నారు. శనివారం చింతపర్తి గ్రామంలో వాసన్ సహకారంతో స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో చిరుధాన్యాల తినుబండారాల కేంద్రాన్ని ప్రారంభించారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకున్నా, తినుబండారాలను తయారు చేసి తినడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు. ఈ యూనిట్ ద్వారా చిరుధాన్యాలతో తినుబండారాలను తయారు చేసి రెడీ టు ఈట్‌గా అందిస్తున్నట్లు తెలియజేశారు. వ్యవసాయ శాఖ అధికారి మురళీమోహన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఊతప్ప, ప్రకృతి టీవీడీ సభ్యులు స్వాతి, ప్రభాకర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు కంభం దామోదర్‌రెడ్డి, ఏపీఎం నరోత్తమరెడ్డి, వాసన్ సంస్థ సిబ్బంది, సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి : యూటీఎఫ్

పీలేరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకంటే ఎక్కువ సర్వీస్ కలిగిన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినిహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పీలేరు యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలని సూచించారు. సత్వరం స్పెషల్‌లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం లోని సెక్షన్ 23(2)కు సవరణ చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయిం పు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నవంబరు 20 నుంచి 27వ తేదీ వరకూ రాష్ట్రంలో ఉన్న అందరు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను కలిసి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చర్చ జరిగేలా వత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 18న జిల్లా స్థాయిలో జరిగే ధర్నాలో ఉపాధ్యాయులందరూ పాల్గొని ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేయాలని పిలుపు నిచ్చారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించక పోతే జనవరి 29న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దేశ వ్యాప్తంగా ఎస్టీఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. జిల్లా సంఘ నేతలు శివారెడ్డి, చంద్రశేఖర్, అక్రమ్ బా షా, బసిరెడ్డి, విశ్వనాథరెడ్డి, సుధాకర్, వేణు, రమణ పాల్గొన్నారు.

గుండెపోటుతో చీరల వ్యాపారి మృతి

కురబలకోట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో చీరల వ్యాపారి మునాఫ్(50) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కదిరి వాసి మునాఫ్ చీరల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇతను చీరలను బ్యాగులో తీసుకుని అమ్మకాలు చేయడానికి బస్సులో బయలుదేరి మండలంలోని అంగళ్ల వద్ద దిగాడు. అప్పటికే గుండె పోటు రావడంతో ఆయన అక్కడిక్కడే కుప్పకూలి కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు ఇక్కడికి వచ్చి మృతదేహాన్ని కదిరికి తరలించారు.

నృసింహుడికి విశేష పూజలు



గుర్రంకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శని వారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖ అంజన్నకు...



కలకడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. వేకువ జామునే స్వామి వారిని వివిధ రకాల పుష్పాలు, తమలపాకుల హారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తదుపరి అభిషేకం, పూజ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సమీప గ్రామాల ప్రజలు కొబ్బరి కాయలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ పూజలు

తంబళ్లపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వసంతపురంలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్త మండలి చైర్మన్ బి.రాజన్న ఆధ్వర్యంలో ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు స్వామి వారిని పుష్పాలు, పత్రాలతో విశేషంగా అలంకరించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

వనమహోత్సవం వాయిదా

మదనపల్లె అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఆదివారం బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వనమహోత్సవ కార్యక్రమం వాయిదా వేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు బీపీఎల్ విజయకుమార్ తెలిపారు. ప్రస్తుతం అధికంగా వర్షం కురుస్తుడడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం సీటీఎం గ్రామం రేగంటివారిపల్లె సమీపంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ విషయం కులబాంధవులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మదనపల్లె అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందివ్వాలని డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ రవి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందన్నారు వంట సరుకులు, కోడిగుడ్డు తనిఖీ చేసి సరుకుల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో నవవధువు లావణ్య ఆత్మహత్యకు కారకులను అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద లావణ్య కుటుంబీకులను ఐద్వా నాయకురాళ్లు పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ కాళ్లపారాణి ఆరకముందే అత్తారింటి వేధింపులు భరించలేకే లావణ్య ఆత్మహత్య చేసుకుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు సమియా, అంజలి, షాహీనా, జానకి తదితరులు పాల్గొన్నారు.

బంగారు వ్యాపారి కిడ్నాప్ కలకలం

- కిడ్నాపర్‌లు పోలీసులే!
- రాత్రంతా వ్యాపారి అక్రమ నిర్బంధం
- ఎమ్మెల్యే వరద జోక్యంతో ఇంటికి చేరిన వ్యాపారి

ప్రొద్దుటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో బంగారు వ్యాపారి కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. పట్టణ నడిబొడ్డు శివాలయం సర్కిల్లో శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో భార్యతో కలిసి స్కూటర్‌లో వెళుతున్న తనకంటి జ్యూవెలర్స్ యజమాని తనకంటి శ్రీనివాస్‌ను కారులో వచ్చిన వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి బలవంతంగా తీసుకెళ్లారు. తన భర్తను ఎక్కడికి తీసుకెళుతున్నారని వారిని ప్రశ్నించగా త్రీటౌన్ పోలీసు స్టేషనుకు రమ్మని చెప్పారు. ఆమె హుటాహుటిన త్రీటౌన్ పోలీసు స్టేషనుకు వెళ్లి పోలీసులను అడుగగా తాము ఎవరిని తీసుకురాలేదని చెప్పారు. దీంతో ఆమె ఆందోళన చెంది రాత్రంతా ప్రొద్దుటూరులోని అన్ని పోలీసు స్టేషన్లకు వెళ్లి విచారించినా తన భర్త ఆచూకి తెలపకపోవడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపించారు. చివరకు అతడిని తీసుకెళ్లిందని పోలీసులే అని తేలింది.

శ్రీనివాస్‌పై చీటింగ్ కేసు నమోదు

హైదరాబాదుకు చెందిన హేమంత్ శర్మ అనే బంగారు వ్యాపారి 2015 నుంచి ప్రొద్దుటూరుకు చెందిన తనికంటి శ్రీనివాస్‌కు బంగారు ఆభరణాలు పంపించేవాడు. నగలు అమ్మి ఎప్పటికప్పుడు శ్రీనివాస్ డబ్బులు పంపించేవాడు. ఈ నమ్మకంతో 2018లో హేమంత్ శర్మ మరోవ్యాపారితో కలిసి సుమారు 10 కిలోల బంగారు నగలను నాలుగు నెలల కాలంలో శ్రీనివాస్‌కు పంపించారు. నగలకు సంబంధించి డబ్బులు ఇవ్వకుండా శ్రీనివాస్ కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో 2021లో నగల డబ్బులు ఇస్తామని హేమంత్ శర్మను ప్రొద్దుటూరుకు రప్పించి శ్రీనివాస్ అతని అనుచరులు కారులో తీసుకెళ్లి పట్టణ శివారులో చితకబాదారు. జరిగిన సంఘటనపై నాడు హేమంత్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీ గురువారం త్రీటౌన్ పోలీసు స్టేషన్లో తనికంటి శ్రీనివాస్ 10 కిలోల బంగారు తీసుకున్నాడని డబ్బులు అడిగితే దాడి చేశారని, చంపుతానని బెదిరిస్తున్నాడని హేమంత్ శర్మ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తాడిపత్రిలో ఉంటున్న తన తమ్ముడు వెంకటస్వామితో పాటు తనను పోలీసులు అదుపులోకి తీసుకుని కొర్రపాడు రోడ్డులోని ఒక ప్రైవేటు ఎస్టేట్‌లో నిర్బంధించారని శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయం శనివారం తెలియడంతో బంగారు వ్యాపారులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే జోక్యంతో శనివారం రాత్రి పోలీసులు శ్రీనివాస్‌ను వైఎంఆర్‌కాలనీలో ఉన్న అతని ఇంటికి తీసుకువచ్చారు.



బంగారు వ్యాపారి శ్రీనివాస్ ఇంట్లో పోలీసులు

ఆస్తిపత్రాలు తీసుకెళ్లిన పోలీసులు?

ఒన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ విజయవాడ నుంచి వచ్చిన వసంత్ అనే పోలీసు అధికారి శ్రీనివాస్ ఇంట్లో కూర్చొని వ్యాపారి హేమంత్ శర్మకు బాకీ డబ్బులు ఇవ్వాలని కోరారు. హేమంత్ శర్మకు తాను బాకీ లేనని తన తమ్ముడు బాకీ ఉన్నాడని శ్రీనివాస్ తెలిపాడు. తమ్ముడు తాను విడిపోయి చాలా ఏళ్లు అయిందన్నాడు. అయినా పోలీసులు రూ.కోట్ల విలువైన ఆస్తి పత్రాలతో పాటు తనికంటి జ్యూవెలర్స్ దుకాణం తాళాలు తీసుకెళ్లారని శ్రీనివాస్ ఆరోపించారు. దీనిపై త్రీటౌన్ సీఐ వేణుగోపాల్‌ను ఆంధ్రజ్యోతి ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. కాగా.. సివిల్ పంచాయితీలో పోలీసులు కిడ్నాపర్లుగా మారిన తీరుపై తీవ్ర విమర్శలకు దారితీసింది. చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బంగారు వ్యాపారికి 41 నోటీసు ఇచ్చి విచారించే అవకాశం ఉన్నా అతడిని బలవంతంగా కారులో ఎత్తుకెళ్లి రాత్రంతా నిర్బంధించడంపై ఆరోపణలు వస్తున్నాయి.

25 నుంచి ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 25వ తేదీ మంగళవారం నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. క్రికెట్ మ్యాచ్‌లు నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంతో పాటు కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలలో జరుగనున్నట్లు వెల్లడించారు. మ్యాచ్‌ల వివరాలిలా.... ఈనెల 25 నుంచి 26వ తేదీ వైయస్ఆర్ఆర్ స్టేడి యంలో సౌత్‌జోన్ విన్నర్-నార్త్‌జోన్ విన్నర్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అలాగే కేఓఆర్ఎం స్టేడియంలో సెంట్రల్‌జోన్ విన్నర్-రెస్ట్ ఆఫ్‌సౌత్‌జోన్, కేఎస్ఆర్ఎంలో రెస్టాఫ్ నార్త్‌జోన్-రెస్టాఫ్ సెంట్రల్‌జోన్‌ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని తెలిపారు. 28 నుంచి 29వ తేదీ వైయస్ఆర్ఆర్ స్టేడియంలో సెంట్రల్‌జోన్ విన్నర్స్-రెస్టాఫ్‌సెంట్రల్‌జోన్, కేఓఆర్ఎం స్టేడియంలో సౌత్ జోన్‌విన్నర్-రెస్టాఫ్ నార్త్‌జోన్, కేఎస్ఆర్ఎంలో నార్త్‌జోన్ విన్నర్-రెస్టాఫ్ సౌత్‌జోన్‌ల మధ్య పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీలు డిసెంబర్ 8వ తేదీ వరకు సాగుతాయని రెడ్డి ప్రసాద్ వెల్లడించారు.

విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి



ఎత్తపు శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడుకు చెందిన యత్తపు శ్రీనివాసులరెడ్డి (49) అనే రైతు శనివారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. భార్య సుబ్బలక్షుమ్మ ఫిర్యాదు మేరకు వివరాలిలా.. శ్రీనివాసరెడ్డి తన ఇంట్లో ఉన్న ఇన్వర్టర్ పనిచేయకపోవడంతో మరమ్మత్తు కోసం విప్పేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. అతన్ని ప్రొద్దుటూరుకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు శ్రీనివాసరెడ్డికి కొడుకు నవీన్, స్రవంతి అనే కూతురు ఉన్నారు.

అర్జీల పరిష్కార బాధ్యత జీఆర్‌ఏలదే..

- పొంతనలేని సమాధానాలిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ అధికారులు (జీఆర్‌ఏలు) బాధ్యతగా వ్యవహరించాలని, పొంతనలేని సమాధానాలతో కాలయాపన చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరకూరి హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీ, జీఆర్‌ఏ ప్రతి స్పందనలపై జేసీ అది తిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీలు వెంకటపతి, రంగ స్వామిలతో కలసి సీఎంవో పీజీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి అధికారి సరళ, అన్ని డివిజన్ల రెవెన్యూ అధికారులతో ఫిర్యాదుల పరిష్కారం, ఆడిట్ అంశాలకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యల పరిష్కారంలో పారదర్శకత ఉండాలన్నారు. సమాధానాలు సూటిగా ఇవ్వాలన్నారు. ఫిర్యాదులు అందిన 24 గంటల్లోగా సంబంధిత జీఆర్‌ఏ అధికారులు ఖచ్చితంగా ఎండార్స్ మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుల ప్రాధాన్యత, ఫ్లాగ్ నోట్ చేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తహశీల్దార్లు పైస్థాయి అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారుల సమస్యలు అందిపుచ్చుకునేలా ఉండాలన్నారు. ఎక్కడా కూడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేయాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో జీఆర్ ఏలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఫిర్యాదుల పట్ల అలక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అన్ని శాఖల్లో పెండెన్సీ ఫిర్యా దులను వచ్చే నెలలోగా జీరోస్థాయికి తేవాలన్నారు. అలాగే గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్‌లో భాగంగా ఆయా మండలాల ఫిర్యాదులను నమోదు చేస్తున్న పీజీఆర్ఎస్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడి తరచూ ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను తెలుసుకొని సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో వీసీ ద్వారా సీపీవో ఓబులమ్మ, అన్ని డివిజన్ల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్ర మోహన్, చిన్నయ్య, డీఎస్పీ కరీం, అన్ని మండ లాల తహశీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



వీసీ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్

క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 3న దివ్యాంగ క్రీడాకారుల జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సాధికార అధికారి జి.చంద్ర శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ (సాప్) ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లె వద్ద గల డీఎస్ఏ క్రికెట్ స్టేడియంలో పారా అథ్లెటిక్ క్రీడా పోటీలు ఉంటాయన్నారు. బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, వీల్‌చైర్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి క్రీడాకారులు అవగాహన ర్యాలీలో పాల్గొనేటట్లు స్థానిక క్రీడా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మరింత సమాచారం కోసం జిల్లా క్రీడా ప్రాధికార అధికారి 871262275ను సంప్రదించాలన్నారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవకాశాలకు మార్గాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భావవ్యక్తీకరణ నైపుణ్యాలు కలవారే ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కడైనా సొంతం చేసుకోగలుగుతారని బెంగుళూరు ఎస్ఈఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్‌బీ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం వైవీయూ వాణిజ్యశాస్త్రశాఖలో కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సబ్జెక్టుకు సంబంధించి ఎంత విషయ పరిజ్ఞానం ఉన్నప్పటికీ అది వెల్లడించే నైపుణ్యత లేకపోతే అవకాశాలు దూరమవుతున్నాయన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసేటపుడు బయోడేటా ప్రభావవంతంగా ఎలా తయారు చేయాలి, ఇంటర్వ్యూ మెలకువలు, వ్యక్తిత్వ లక్షణాలు, సంభాషణా నైపుణ్యాలు, ప్రవర్తనా నైపుణ్యాల గురించి ఉదాహరణలతో వివరించారు. నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచనలు, బాధ్యతా విలువలు ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. కామర్స్‌శాఖ విభాగాధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి విద్యార్థుల సందేహ నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయభారతి, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంజనేరులో మహిళ మృతదేహం



చిట్వేలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సమీపంలోని గుంజనేరులో శనివారం ఉదయం ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆమె నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చునని ప్రాథమికంగా అంచనా వేశారు. కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వివరించారు. మృతదేహంపై తెలుపు రంగు నైటీ, రెండు చేతులకు నాలుగు ఇత్తడి గాజు లు, మెడలో తాయెత్తు ఉందని, వివరాలు తెలిస్తే చిట్వేలి ఎస్ఐ 9121100579, కోడూరు రూరల్ సీఐ 9121100576 నంబర్లను సంప్రదించాలని కోరారు.

యువతి ఆత్మహత్యాయత్నం



అమ్మాజాన్

ములకలచెరువు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి అమ్మాజాన్(23) ఆత్మహ త్యాయత్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... పెద్దపాళ్యం వాసి అమ్మాజాన్‌కు ఆరీఫుల్లాతో వివాహమైంది. అయితే భార్య భర్తలిద్దరూ విడాకులు తీసుకున్నారు. దీంతో అమ్మాజాన్ అదే గ్రామానికి చెందిన సునీల్‌తో సహజీవనం చేస్తూ గర్భిణి అయ్యింది. దీంతో తనను వివాహం చేసుకోవాలని కోరగా సునీల్, అతని కుటుంబీకులు నిరాకరించడంతో విషద్రావణం తాగింది. దీంతో కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రూయాకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తంబళ్లపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీ కొనడంతో మణి(25) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు... ఈదల చెరువుపల్లె వాసి మణి శనివారం ఉదయం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో లక్కసముద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలో నల్లగుట్ట వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో మణి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతన్ని హుటాహుటిన మదనపల్లె ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ డస్ట్ తరలింపుపై వివాదం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు

రామసముద్రం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): క్వారీ డస్ట్ తరలింపుపై క్వారీ యజమానురాలు, కొనుగోలుదారు మధ్య వివాదం నెలకొంది. ఇది రెండు సామాజిక వర్గాల మధ్య ఉద్రిక్తలకు దారి తీసింది. రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీ శాన్సిపాం వద్ద ఉన్న శ్రీరామ గ్రానైట్స్ ఫ్యాక్టరీ నుంచి డస్ట్ కొనుగోలు కోసం మండల కేంద్రానికి చెందిన భాస్కర్ అనే ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి వెళ్లాడు. అయితే డస్ట్ తరలింపు సమయంలో క్వారీకి భూమి లీజుకు ఇచ్చిన దర్శన్‌గౌడ్‌కు భాస్కర్‌కు మధ్య వివాదం నెలకొంది. దర్శన్‌గౌడ్ తనను కులం పేరుతో దూషించారని భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే రిపోర్టర్ పేరుతో భాస్కర్ తనపై దౌర్జన్యం చేసి డస్ట్ దొంగతనం ప్రయత్నం చేయగా అడ్డు వచ్చిన తనపై కులం పేరు చెప్పి అట్రాసిటీ కేసు పెడతానని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని భాస్కర్‌తో తనకి ప్రాణహాని ఉందని భాస్కర్ నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ శివమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువురు ఫిర్యాదు దారుల మద్దతు దారులతో మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై ఇద్దరి ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

రాగి తీగలు, కేబుల్ చోరీ దొంగల అరెస్టు

పులివెందుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతు పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ తీగలు, మోటర్ల వద్దనున్న కేబుల్ దొంగ తనం చేస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం డీఎస్పీ మురళినాయక్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. లింగాల, తొండూరు, సింహాద్రిపురం, తదితర మండలాల్లో ఇటీవల రైతులకు సంబంధించిన మోటర్ల వద్ద కేబుల్‌వైర్లు, పొలాల వద్ద ఉన్న ఆరు ట్రాన్స్ ఫార్మర్లలోని కాపర్ తీగలను దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై రూరల్ సీఐ రమణ, లింగాల ఎస్ఐ అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో బృందంగా ఏర్పడి ఈ కేసులను చేదించారన్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూ రుకు చెందిన జాఫర్ షరీఫ్, శివమొగ్గ జిల్లాకు చెందిన హరూన్ రషీద్, సత్యసాయి జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన హరిజన సురేంద్రలు ఈ దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. జాఫర్ షరీఫ్‌కు ఒక సొంత కారు ఉందని, డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తుం టారన్నారు. మద్యం, జూదం వంటి వ్యసనాలకు బానిసకావడంతో దొంగతనాలకు అలవాటుపడ్డారన్నారు. ఇతనికి హరూన్ రషీద్ స్నేహితుడు, హరిజన సురేంద్ర వీరికి తోడై కేబుల్, వైర్ల దొంగతనాలకు పాల్ప డ్డారన్నారు. పులివెందుల నియోజక వర్గంలోని రైతు పొలాల వద్ద ఉన్న ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను పగుల గొట్టి, అందులోని కాపర్ తీగలను చోరీ చేశారని తెలిపారు. వీరు పగలు కారులో తిరుగుతూ ఎక్కడెక్కడ మోటర్లు ఉన్నాయని గుర్తించి దొంగతనా లకు పాల్పడేవారు. వీరిని శనివారం మధ్యాహ్నం 12గంటల ప్రాం తంలో లింగాల మండలం అంబకపల్లె గ్రామ సమీపంలో ఎస్ఐ అనిల్‌కుమార్ అరెస్టు చేశారన్నారు. వీరి వద్ద నుంచి రూ.2ల క్షల 85వేలు విలువ చేసే కేబుల్, కాపర్ వైరు రికవరీ చేశామన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ మురళినాయక్

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

కమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. శని వారం స్థానిక నాలుగో రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులు దళారుల చేతిలో మోసపోకూ డదన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలోనే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ-పంటలో నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి అయిన రైతులు, తమ ధాన్యం విక్రయించేందుకు సిద్ధమైతే కొనుగోలు చేస్తామన్నారు. తాము అమ్మదలచిన ధాన్యం వాట్సప్ ద్వారా కూడా నమోదు చేసుకోవ చ్చన్నారు. అందుకు రైతులు 7337359375కు హాయ్ అని పంపాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా టోల్‌ఫ్రీ నెంబరు 1967ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

కలకడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ రమేష్ బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు... అధికారులకు సమాచారం అందడంతో వారి ఆదేశాల ప్రకారం సత్యవతినది బ్రిడ్జి వద్ద తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో సంబేపల్లి వైపు నుంచి కలకడకు వేగంగా వస్తున్న టిప్పర్ డ్రైవర్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా సుండుపల్లి మండలం నుంచి మదనపల్లికి ఇసుకను తరలిస్తున్న గుర్రకొండ మండలం ఎల్లుట్ల వాసి డ్రైవర్ శివప్రసాద్, మదనపల్లి వాసి ఓనర్ ముబారక్‌పై కేసు నమోదు చేసి టిప్పర్ స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ వివరించారు.

27 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 27వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంపీఎడ్, మూడో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను ఆయన ప్రకటించారు. ఈనెల 27, 29 డిసెంబరు 1,2,3,5,8 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఫిమేల్) శిక్షణ కోర్సులో (2025-26 విద్యాసంవత్సరానికి) ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దర ఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని ప్రభు త్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కేంద్రాలలో శిక్షణ ఉంటుందన్నారు. సీఎఫ్ డబ్ల్యు. ఏపీ.ఎన్ఐసీ.ఇన్ ద్వారా ప్రవేశ దరఖాస్తులను ఆన్‌లై న్‌లో చేయాలన్నారు. కన్వీ నరు, మేనేజ్మెంట్ కోటా సీట్లకు ఈ నెల 30 తేదీ వరకు గడువుగా పొడిగించినట్లు పేర్కొన్నారు.

గెస్ట్‌ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో గెస్ట్‌ఫ్యాకల్టీ నియామకం కోసం ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ.టి.శ్రీనివాస్ తెలిపారు. అభ్యర్థులు పీహెచ్‌డీ/ఎం.టెక్ (ఏదైన కంప్యూటర్ స్ట్రీమ్)/ఎంసీఏ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్య ర్థులు బయో-డేటా, సంబంధిత ఒరిజినల్, జిరాక్స్ కాపీల సెట్‌తో నేరుగా న్యూ ఆర్ట్స్ బ్లాక్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.